నవతెలంగాణ

ఆదిలాబాద్

శనివారం | జులై 20, 2024 | www.navatelangana.com

మద్యం తాగి వాహనాలు నడపొద్దు : ఎస్ఐ శ్రీధర్

నవతెలంగాణ-జైపూర్

మద్యం తాగి వాహనాలు నడపొద్దని ఎస్సై శ్రీధర్ అన్నారు. శుక్రవారం సాయంత్రం చెన్నూర్-మంచిర్యాల ప్రధాన రహదారిలో వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాదని, వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ద్విచక్ర వాహనం నడుపుతున్నప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం తాగి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలకు అవకాశం ఉంటుందని తెలిపారు. అదేవిధంగా వాహనాలను మితిమీరిన వేగంతో నడపరాదని సూచించారు.



తిరిగి రుణాలు ఇస్తాం : చుంచు శ్రీనివాస్

వాంకిడి : ఆదిలాబాద్ జిల్లా సహకార బ్యాంకులో తిరిగి క్రాప్ లోన్ పొందడానికి రైతులు సరైన పత్రాలతో రావాలని సహకార సంఘం చైర్మన్ చుంచు శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రైతాంగానికి రుణమాఫీ చేసిన రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా సహకార బ్యాంకులో 197 మందికి రుణమాఫీ జరిగిందని. రైతులు తిరిగి రుణాలను పొందాలనుకుంటే సోమవారం నుండి తమ సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉంటారని తెలిపారు. లోన్ పొందాలనుకునే రైతులు వన్ బి ఫారంతో పాటు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంకు పాస్ పుస్తకం, పాన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్ ప్రతులతో రావాలని సూచించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ చుంచు శ్రీనివాస్, సిబ్బంది బొజ్జిరావు, పవన్ పాల్గొన్నారు.



కదలరు..వదలరు..!

- జిల్లాలోనే తిష్టవేసిన అధికారులు, ఉద్యోగులు
- ఏండ్లు గడుస్తున్నా ఇక్కడే కొనసాగుతున్న వైనం
- తప్పనిసరి బదిలీ నిబంధనలు పట్టించుకోని వైనం
- ప్రభుత్వ స్థాయిలో పైరవీలతో ఉన్న చోటే ఉద్యోగం
- విమర్శలకు తావిస్తున్న కొందరు అధికారుల తీరు

ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ సహజం. కానీ వీరికి మాత్రం అలాంటిదేమీ ఉండటం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా..పాలకులు మారుతున్నా వీరు మాత్రం మారడం లేదు. ఏండ్లుగా ఒకే చోట తిష్టవేస్తూ ఉద్యోగం చేస్తున్నారు. వీరు ఆదిలాబాద్ జిల్లాను వీడకపోవడం మూలంగా.. ఇతర జిల్లాల నుంచి ఇక్కడకు ఎవరూ రావడం లేదు. ఇప్పటికే కొన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగుల బదిలీలు జరుగుతుండగా.. ఇంకా అనేక శాఖలకు చెందిన వారిని మాత్రం విస్మరించినట్లు తెలుస్తోంది. ఒకే చోట నాలుగేండ్లు పనిచేసిన వారికి తప్పనిసరి బదిలీ చేయాలనే నిబంధనలు ఉన్నా..వారికి ఇవి ఏ మాత్రం పట్టడం లేదు. వివిధ శాఖలకు చెందిన కొందరు ఉన్నతాధికారులైతే ఏండ్ల తరబడి ఇక్కడే విధులు నిర్వహిస్తున్నారు. ఒకే చోట కొనసాగేలా ప్రభుత్వ స్థాయిలో పైరవీలు చేసుకుంటూ కాలం గడుపుతున్నారనే విమర్శలున్నాయి. మల్టీజోన్ పోస్టులు కావడంతో ప్రభుత్వమే దీనిపై దృష్టిసారించాల్సి ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఐటీడీఏ పీఓ, అధికారులు(ఫైల్)

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న అధికారులు, ఉద్యోగుల విధి నిర్వహణలో బదిలీ అనేది సహజమైన ప్రక్రియ. ఆయా శాఖలకు చెందిన వారికి విధిగా బదిలీలు జరుగుతున్నాయి. ఇక్కడి జిల్లా నుంచి ఇతర జిల్లాకు వెళ్లడం..అక్కడ్నుంచి కొత్త అధికారులు ఇక్కడకు రావడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి. కొన్నిశాఖలకు మాత్రం ఇది రెగ్యూలర్‌గా జరుగుతోంది. కానీ మరికొన్ని శాఖలకు మాత్రం బదిలీ అనేది ఉండటం లేదనే ఆరోపణలున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి ఏదేని ఒక ప్రాంతంలో నాలుగేండ్ల పాటు విధులు నిర్వహిస్తే అలాంటివారిని అందరినీ తప్పనిసరిగా బదిలీ చేయాలనే నిబంధన ఉంది. కానీ ఈ నిబంధనలు కేవలం కాగితాలకే పరిమితమవుతున్నాయి. ప్రభుత్వాలు సైతం వీటిపై దృష్టిసారించకపోవడం మూలంగా కొందరు అధికారులకు అనుకూలంగా మారింది. తాము ఏం చేసినా చెల్లుబాటు అవుతుందనే ధోరణితో వ్యవహరిస్తున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని ప్రభుత్వశాఖలకు చెందిన ఉన్నతాధికారులు ఏండ్లుగా ఇక్కడే కొనసాగుతున్నారు. కిందిస్థాయి నుంచి పదోన్నతులు పొందుతూ ఆ శాఖల కార్యాలయాన్ని వీడటం లేదు. ప్రభుత్వస్థాయిలో పలుకుబడి కలిగిన వ్యక్తులను మచ్చిక చేసుకోవడం.. ఇక్కడ జిల్లా స్థాయిలోనూ ఉన్నతాధికారులతో సత్సంబంధాలు ఏర్పాటుచేసుకుంటూ స్థానికంగానే కొనసాగుతున్నట్లు విమర్శలున్నాయి. జిల్లా స్థాయి అధికారుల పోస్టులు మల్టీ జోనల్ స్థాయిలోకి రావడంతో ప్రభుత్వమే వీటిని పరిశీలించాల్సి ఉంటుంది. కానీ ప్రభుత్వాలు దృష్టిసారించకపోవడం మూలంగా వీరు జిల్లా నుంచి ఎటూ కదలడం లేదనే ఆరోపణలున్నాయి.



బదిలీ కౌన్సెలింగ్‌కు హాజరైన ఉద్యోగులు(ఫైల్)

అనేక ఏండ్ల నుంచి ఇక్కడే..!

జిల్లాలో ఇప్పటికే రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యాశాఖ, జిల్లా పంచాయతీ వంటి కొన్నిశాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగుల బదిలీ ప్రక్రియ పూర్తయింది. మరికొన్నింటివి కొనసాగుతున్నాయి. కానీ ఇంకా అనేక శాఖలకు చెందిన వారికి మాత్రం బదిలీలు జరగడం లేదు. వైద్యఆరోగ్యం, వ్యవసాయం, సాంఘీక సంక్షేమం, యువజన, క్రీడల అభివృద్ధి, సర్వేల్యాండ్ రికార్డ్స్, ఖజానాశాఖ, డిగ్రీ అధ్యాపకులు, రవాణశాఖ, ఐటీడీఏ, రిమ్స్, పశు సంవర్ధకం, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ తదితరశాఖల్లో కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు బదిలీలు జరగడం లేదనే ఆరోపణలున్నాయి. ఆయా శాఖల పరిధిలో అనేక మంది అధికారులు, ఉద్యోగులు ఏండ్లుగా ఒకే చోట కొనసాగుతున్నారు. కొన్ని సందర్భాల్లో ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు మారుతున్నా..వారి కింది స్థాయి అధికారులు, ఉద్యోగులు మాత్రం ఎటూ కదలడం లేదు. కొన్నిశాఖలకు చెందిన కిందిస్థాయి అధికారులు ఏండ్లుగా ఒకే చోట తిష్టవేసి శాఖల మీద పట్టుసాధించడంతో వారు ఏం చెప్పిందే వేదం అన్నట్లుగా మారింది.

ఆయా శాఖలకు కొత్తగా వచ్చిన ఉన్నతాధికారులు సైతం వీరు చెప్పిందే వినాల్సిన పరిస్థితి నెలకొందనే ఆరోపణలున్నాయి. శాఖలకు సంబంధించి ప్రగతి కనిపించకపోయినా ఎవరూ ఏమీ అనలేని పరిస్థితి ఉందనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టిసారించి నిబంధనల ప్రకారం అందరికీ బదిలీల ప్రక్రియ చేపట్టాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. ఇక్కడి వారు ఇతర ప్రాంతాలకు వెళితేనే.. ఆయా ప్రాంతాల నుంచి కొత్తగా అధికారులు, ఉద్యోగులు జిల్లాకు వచ్చేందుకు మార్గం సుగుమం అవుతుందనే వాదన వినిపిస్తోంది.

మహిళా శక్తి క్యాంటీన్లను వెంటనే ప్రారంభించాలి

- జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళా శక్తి పథకం ద్వారా నిర్దేశించిన క్యాంటీన్లను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో మహిళా శక్తి పథకం కింద ఏర్పాటు చేస్తున్న క్యాంటీన్ పనులను జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారి, జిల్లా వైద్యాధికారి తుకారాంతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి కొరకు ప్రభుత్వం చేపట్టిన మహిళా శక్తి పథకం ద్వారా చేయూతనందించడం జరుగుతుందని, క్యాంటీన్ త్వరగా ప్రారంభించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రికి వచ్చే రోగులు, సహాయకులకు క్యాంటీన్ ఉపయోగకరంగా ఉంటుందని, క్యాంటీన్లు నాణ్యమైన అల్పాహారం, వస్తువులు ఉండే విధంగా చూడాలని తెలిపారు. మహిళా శక్తి పథకంతో మహిళ సంఘాలకు అదనపు ఆదాయం సమకూరుతుందని తెలిపారు. సోమవారం నాటికి క్యాంటీన్ ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని, ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే వారికి ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు అధికారి రామకృష్ణ, ఆసుపత్రి పర్యవేక్షకులు చెన్నకేశవులు, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎపిఎం శ్రీనివాస్, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల జియో ఫొటో అటెండెన్స్ రద్దు చేయాలి



నవతెలంగాణ - చింతలమానేపల్లి

ఉపాధ్యాయుల జియో ఫొటో అటెండెన్స్‌ను రద్దు చేయాలని పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షుడు ఎటుకూరు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం మండల అధ్యక్ష, కార్యదర్శులు దుర్గం కురుమదాస్, రౌతు రవి ఆధ్వర్యంలో సభ్యత నమోదు కార్యక్రమాన్ని డబ్బా, చింతలమానేపల్లి, బాబాసాగర్ గంగాపూర్, బాబాపూర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు మాట్లాడారు. జిల్లాలో 15 మండలాల్లో మారుమూల ప్రాంతాల్లో చాలా పాఠశాలలకు బస్సు, ఆటో సౌకర్యం లేదన్నారు. రోడ్డు సౌకర్యం లేని పాఠశాలలూ ఉన్నాయన్నారు. కనీసం ఫోన్ సిగ్నల్స్ రాని పాఠశాలలు అనేకం ఉన్నాయని పేర్కొన్నారు. కానీ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయులు జియో ఫొటోలు ఉదయం 9గంటలకు పెట్టాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ పద్ధతిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యాయులు పసల జయరాజ్, మురళీ, సుదర్శన్, దేవరావ్ చౌహాన్, దొడ్డిపట్ల రవికుమార్ పాల్గొన్నారు.

రుణమాఫీ హామీ నిలబెట్టుకున్న ప్రభుత్వం



నవతెలంగాణ-సారంగాపూర్

రైతులకు ఇచ్చిన మాట కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకుందని డిసిసి అధ్యక్షులు శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల వరకు 12 డిసెంబర్ 2018 నుండి 9 డిసెంబర్ 2023 వరకు రైతుల పేరిట ఉన్న బకాయిలు మాఫీ కానున్నట్లు వివరించారు. రైతుల రుణ ఖాతాలో నేరుగా మాఫీ సొమ్ము జమ చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-తాంసి

తాజా మాజీ జెడ్పిటిసి తాటిపెల్లి రాజు(గంగాధర్‌రావు) తల్లి శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. స్వగ్రామమైన భీంపూర్ మండలం కమట్‌వాడలో ఆయన కుటుంబాన్ని తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన పలువురు నాయకులతో కలిసి ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ పరామర్శించారు.

మరమ్మత్తులకు మరో నెల సమయం

- అనుకున్నట్లు పనులు పూర్తయితే ఆగస్టు 2వ వారంలో విద్యుదుత్పత్తి పునఃప్రారంభం
- గతేడాది మొదటి యూనిట్, ఇప్పుడు రెండో యూనిట్‌లో కొనసాగుతున్న ఓవర్‌హాలింగ్ పనులు

నవతెలంగాణ-జైపూర్

సింగరేణి థర్మల్ విద్యుత్ ప్లాంట్ 2వ యూనిట్ ఓవర్ హాలింగ్ పనుల పూర్తికి మరో నెల రోజుల సమయం పట్టనున్నట్లు తెలుస్తోంది. క్యాపిటల్ ఓవర్‌హాలింగ్ పనుల నిమిత్తం జూన్ 15న యూనిట్-2 ద్వారా విద్యుత్ ఉత్పత్తిని నిలిపేశారు. మరో నెల రోజుల్లో మరమ్మత్తు పనులు పూర్తి చేసి ఆగస్టు 2వ వారంలో తిరిగి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలన్న లక్ష్యంతో పనులు పూర్తి చేస్తున్నారు. సాధారణంగా సంవత్సరానికి ఒకసారి పవర్ ప్లాంట్ల వార్షిక మరమ్మత్తు పనులు చేపట్టడం సర్వసాధారణం. కాగా క్యాపిటల్ ఓవరహాలింగ్ మరమ్మత్తు పనులు ప్రతి 5నుండి6 సంవత్సరాల మధ్య చేపట్టడం జరుగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రతి విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 55వేల పని గంటల అనంతరం క్యాపిటల్ ఓవరహాలింగ్, మరమ్మత్తు పనులు చేపట్టాల్సి ఉంటుంది. 1200 మెగా వాట్ల విద్యుత్ ప్లాంట్ నెలకొల్పిన జైపూర్ ఎస్టీపీపీ యూనిట్-1లో గత సంవత్సరం క్యాపిటల్ ఓవర్‌హాలింగ్ మర్మమత్తులు పూర్తి చేశారు. ఈ ఏడాది యూనిట్-2లో చేపట్టి క్యాపిటల్ ఓవర్‌హాలింగ్ మరమ్మత్తు పనులు పూర్తి చేసి వీలైనంత తొందరగా విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని యాజమాన్యం భావిస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన 600 మెగావాట్ల చొప్పున రెండు యూనిట్లలో ఒక్కొక్క యూనిట్ నుండి రోజు ఒకింటికి గరిష్ఠంగా లక్షా44 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది. నూటికి నూరు శాతం ఉత్పత్తి సాధించకపోయినా కనిష్ఠంగా రోజు ఒకింటికి లక్షా25 వేల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సాధిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఓవర్‌హాలింగ్ చేపట్టి ఇప్పటికి నెల రోజులు గడిచిపోతుండగా మరో నెల రోజులు పూర్తికానిదే ఓవర్‌హాలింగ్ పనులు పూర్తి కావని తెలుస్తోంది. ప్రతి పవర్ స్టేషన్‌లో వార్షిక, క్యాపిటల్ ఓవర్‌హాలింగ్ పనులు చేపట్టడం సర్వసాధారణమే అయినప్పటికీ విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంతో సంస్థ ఆదాయానికి గండిపడుతోంది. ఈ క్రమంలో వారం రోజుల వ్యవధితో సింగరేణి డైరెక్టర్ (ఈఅండ్ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్) వెంకటేశ్వర్‌రెడ్డి ఎస్టీపీపీని సందర్శించారు. వీలైనంత తొందరగా ఓవర్‌హాలింగ్ పనులు పూర్తి చేసి విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలని అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కోరారు.



జైపూర్ ఎస్టీపీపీ(ఫైల్)

నిర్దిష్ట కాలపరిమితితో మరమ్మత్తులు

విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలలో నిర్దిష్ట కాల పరిమితితో మరమ్మత్తు పనులు చేపట్టాల్సి ఉంటుంది. వార్షిక మరమ్మత్తులు సర్వసాధారణమైనా క్యాపిటల్ ఓవర్‌హాలింగ్ పనులు 5నుండి6 సంవత్సరాల వ్యవధి లేదా 55వేల పని గంటల అనంతరం పూర్తి స్థాయి మరమ్మత్తులు చేపట్టాలి. ప్రధానంగా బాయిలర్, వాటర్ ట్యూబ్స్, వాల్వులు, బాయిలర్ సేఫ్టీ వాల్వులు, ఫీడ్ వాటర్ వాల్వులు, ఇతర వాల్వులు లాపింగ్ చేయడం జరుగుతుంది. బాయిలర్ వాటర్, ట్యూబ్స్, హెడ్డర్స్, వాల్వులు, హైడ్రాలిక్ టెస్టింగ్ చేసి లీకేజీలు లేవన్నట్లు నిర్ధారించుకోవాలి. బాయిలర్ వర్కింగ్ ప్రెసర్ కంటే ఎక్కువ ప్రెసర్‌లో హైడ్రాలిక్ టెస్ట్ చేయాలి. అవసరమైతే బాయిలర్ ఇన్స్‌పెక్టర్, ఇన్స్‌పెక్టర్ ఆఫ్ బాయిలర్స్ సమక్షంలో చేయాల్సి వస్తుంది. అంతా ఓకే అనుకున్నప్పుడు మాత్రమే బాయిలర్‌ను వినియోగించాల్సిన అవసరం ఉంటుంది. బాయిలర్ బంద్ ఉందనుకున్నప్పుడు టర్బైన్, జనరేటర్ కండెన్సర్, ఫీడ్ పంప్‌లను కూడా రిపేర్ చేయడం జరుగుతుంది. ఇక్కడి యూనిట్-2లో చేపట్టిన ఓవర్‌హాలింగ్ పనుల్లో భాగంగా సుమారుగా లక్షా40వేల ట్యూబ్‌ల థిక్‌నెస్ తనిఖీ చేసి మరమ్మత్తు చేపట్టినట్లు తెలుస్తోంది. మొత్తం 1200 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేసిన సింగరేణి యాజమాన్యం విద్యుత్ ఉత్పత్తి నిర్వహణ బాధ్యతలు పవర్‌మేక్ ప్రైవేటు కంపెనీకి అప్పగించింది. సింగరేణి యాజమాన్యం పర్యవేక్షణలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగిస్తున్న పవర్‌మేక్ కంపెనీ నిష్ణాతులైన ఇంజనీర్ల పర్యవేక్షలో ఓవర్‌హాలింగ్ పనులు చేపట్టినట్లు తెలుస్తోంది..



మరమ్మత్తు పనులు పరిశీలిస్తున్న డైరెక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి(ఫైల్)

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్



నవతెలంగాణ-కెరమెరి

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. శుక్రవారం మండలంలోని నీంగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్యాతిథిగా హాజరై మాట్లాడారు. పాఠశాలల్లో స్కావెంజర్లను నియమించకపోవడంతో విద్యార్థులే తరగతులను పరిశుభ్రం చేసుకోవాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు నానా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దోమ తెరలు పంపిణీ చేసి విద్యార్థులు వ్యాధుల బారిన పడకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. వసతి గృహాల్లో మెనూ పాటించడం లేదని పేర్కొన్నారు. దీంతో పేద విద్యార్థులు పౌష్టికాహారానికి దూరమవుతున్నారని తెలిపారు. జిల్లాలో అనేక పాఠశాలల్లో ఏకోపాధ్యాయులే ఉండడంతో విద్యావ్యవస్థ కుంటుపడుతుందని వాపోయారు. పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా ఉపాధ్యాయులు నియమించి న్యాయం చేయాలన్నారు. ఉన్నత విద్య కోసం పేద విద్యార్థుల సౌకర్యార్థం జిల్లాకు పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వసాకే సాయికుమార్, కార్యదర్శి చాపిలే సాయికృష్ణ, ఉపాధ్యక్షులు సతీష్, సహాయ కార్యదర్శి జాఫర్, తుమ్మిడి భీమేష్, నాయకులు నితీష్, అయూబ్‌ఖాన్, సాయి, రాజేందర్, నవీన్, కార్తీక్, భీంరావు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు ఈఎల్ మంజూరు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

వేసవి సెలవుల్లో ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు ఆర్జిత సెలవులు వెంటనే మంజూరు చేయాలని టిఎస్‌యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందురావు డిమాండ్ చేశారు. జిల్లా విద్యాధికారి అశోక్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఎన్నికల విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులకు వెంటనే ఆర్జిత సెలవులు మంజూరు చేయాలన్నారు. ఉపాధ్యాయ బదిలీల్లో భాగంగా మండలాలు మారిన ఉపాధ్యాయులకు సర్వీస్ రిజిస్టర్‌లో ఆర్జిత సెలవులు నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ మంజూరు చేయకపోవడంతో ఇబ్బందిగా మారిందన్నారు. సిర్పూర్-టి ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందని, అక్కడ కార్యాలయ సిబ్బంది బదిలీ కావడంతో ఉపాధ్యాయులపై పని భారం పెరిగే అవకాశముందన్నారు. వెంటనే కార్యాలయ సిబ్బందిని నియమిస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ షిండే, జిల్లా కోశాధికారి రమేష్, జిల్లా కార్యదర్శి రవికుమార్, మండల బాధ్యులు అశోక్, బి.రవి పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
2
ఆదిలాబాద్-నిర్మల్
శనివారం | జులై 20, 2024 | www.navatelangana.com

40 దేశాల కరెన్సీ నాణేల ప్రదర్శన

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సొనాల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్ బాసెట్టి నాణేల ప్రదర్శనను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా సందర్భాలలో విడుదల చేసిన మహనీయుల, జయంతి,



వర్ధంతి లా నాణేలు, నిజాంల నాటి నాణాలు 1905, 1910, బ్రిటిష్ వారి నాణేలు 1అణ మొగల్ పాలకుడు అక్బర్ 1556-1605 నాటి రాగి నాణాలు షాజహాన్ 1628-1658 వెండి నాణెం ప్రదర్శించారు. గత చరిత్రను నాణాల ద్వారా భావితరాలకు అందించడమే తన ఉద్దేశమని అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గీత వాణి, శ్రావణి, నర్సయ్య, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రాథమిక హక్కులపై అవగాహన పెంచుకోవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ

రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులపై ప్రతి విద్యార్థి అవగాహన పెంపొందించుకోవాలని న్యాయవాది జి.దమ్మపాల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలలో న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత హోం మంత్రిత్వ శాఖ ఇటీవల 3 కొత్త క్రిమినల్ చట్టాలు, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్షా అదినియం ఈ మూడు చట్టాలు జూలై 1 నుంచి అమల్లోకి వచ్చాయని అన్నారు. నూతన చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు విజయ్, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఆర్.నారాయణ, అధ్యాపకులు గణేష్ పాల్గొన్నారు.



అవిశ్వాసానికి అక్రమాలే ప్రధాన కారణం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్‌లో మాజీ వైస్ చైర్మెన్ జహీర్ రంజాని అవినీతి, ఆగడాలు హద్దు మీరిపోవడంతో అవిశ్వాసం ప్రవేశపెట్టడానికి ప్రధాన కారణమని బీఆర్ఎస్ మైనారిటీ విభాగం నాయకులూ సలీం అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నట్టు పేర్కొన్నారు. వైస్ చైర్మెన్ అవిశ్వాసం కోసం కాంగ్రెస్ కౌన్సిలర్లు సైతం సంతకాలు చేసిన విషయాన్నీ గుర్తు చేశారు. జహీర్ రంజాని కాంగ్రెస్‌లో చేరే సమయంలో సొంత పార్టీకి చెందిన మైనారిటీ నాయకులే తీవ్రంగా వ్యతిరేకించారని పేర్కొన్నారు. వైస్ చైర్మెన్ రౌడీయిజం, అవినీతి పెరగడమే అవిశ్వాసానికి దారి తీసిందని, అందుకు అన్ని పార్టీల కౌన్సిలర్లు మద్దతు తెలిపారని అన్నారు. అధికారం ఉన్నన్ని రోజులు అనుభవించిన మాజీ వైస్ చైర్మెన్ అధికారం నుంచి దిగిపోగానే కాంగ్రెస్‌లో చేరడం దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసిపోయాయని చేసిన వ్యాఖ్యలను ఖండించారు. గత జెడ్పీ చైర్మెన్ ఎన్నిక సమయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి పని చేశాయని గుర్తు చేశారు. మాజీ మంత్రి జోగు రామన్న మైనారిటీల సంక్షేమం కోసం విశేష కృషి చేశారని, భవిష్యత్తులోనూ తిరిగి వైస్ చైర్మెన్ ఎన్నిక జరిగితే ముస్లిం అభ్యర్థినే నిలబెడతారని స్పష్టం చేశారు. సమావేశంలో కౌన్సిలర్ ఇమ్రాన్, మోబిన్, సలీం ఉన్నారు.

మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దృష్టి



నవతెలంగాణ-కుభీర్

ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ డా.జానకి షర్మిల ఆదేశాల మేరకు భైంసా సబ్ డివిజన్‌లో అన్ని పోలీస్ స్టేషన్‌లలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఏఎస్పీ అవినాష్ కుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పార్డి(బి) గ్రామంలో ఫ్రెండ్లీ పోలీస్ కార్యక్రమంలో భాగంగా యువకులు, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల అధిక చోట్ల రోడ్డు ప్రమాదాలకు ముఖ్య కారణం మద్యం మత్తులో వాహనాలు నడపడం ఒకటైతే, మరొకటి ర్యాష్ డ్రైవింగ్ చేయడం అన్నారు. అదేవిధంగా మైనర్లు బైకులు, కార్లు నడుపుతూ వరుసగా ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు, దీంతో పాటు ఇన్సూరెన్స్ లేని వాహనాల వాళ్ల జరిగే ప్రమాదాలలో ఎవరైనా చనిపోతే వారి కుటుంబానికి ఎటువంటి ఆర్థిక సాయం అందదు. ఈ అంశాలను తీవ్రంగా పరిగణించిన జిల్లా పోలీసులు ప్రతిరోజు గ్రామాల్లో వాహనాల తనిఖీలు చేపడుతున్నారని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగి పట్టుబడ్డ యువకులకు మద్యం తాగడం ద్వారా కలిగే అనర్థాలు, వారికి భవిష్యత్తులో జరిగే నష్టాల గురించి తల్లితండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించటం జరుగుతుందని అన్నారు. అదే విధంగా రెండో సారి మద్యం తాగి పట్టు పడితే చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రనే రోడ్డు ప్రమాదాల నియంత్రనే లక్ష్యంగా ప్రతి రోజూ జిల్లా వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించటం జరుగుతుందని అన్నారు. జిల్లా వ్యాప్తంగా బస్టాండ్లు, వ్యాపార సముదాయాలలో, గ్రామాలలో, తాండలలో నిత్యం పోలీస్ జాగిలాలతో తనిఖీలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నిషేధిత గంజాయి అక్రమ రవాణాను నిరోధించడానికి నార్కోటిక్స్ విభాగంలో ప్రత్యేక శిక్షణ పొంది తనిఖీలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. గంజాయి ఇతర మత్తు పదార్థాలను కనిపెట్టడంలో జాగిలాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని అన్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తూ, అక్రమార్జనే ధ్యేయంగా నిషేధిత గంజాయిని రవాణా చేసే వ్యక్తులను పట్టుకోవడానికి వాహన తనిఖీలు చేపట్టడంతో పాటు పోలీస్ జాగిలాల సహాయంతో కూడా వారిని పట్టుకోవడం జరుగుతుందని తెలిపారు. ఎవరైనా నిషేధిత గంజాయిని రవాణా చేస్తున్నట్లు గానీ, విక్రయిస్తున్నట్లు గానీ సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి డైల్ 100కి సమాచారం అందించాలని సూచించారు. అదే విధంగా ఎలాంటి సమస్య లేకుండానే కొందరు వ్యక్తులు 100కు కాల్ చేయడం జరుగుతుందని వారిపైనే కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు గ్రామంలోని ఆలయం, పాఠశాల పరిసర ప్రాంతాల్లో గల మద్యం, బెల్ట్ షాపులను తొలగించాలని ఏఎస్పీకి విజ్ఞప్తి చేశారు. అనంతరం గ్రామస్తులు ఏఎస్పీకి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో భైంసా రూరల్ సీఐ నైలు, కుంటాల ఎస్సై, కుభీర్ పోలీసులు, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోని స్థానిక శివాజీ చౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ బేల, జైనథ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం పాలాభిషేకం చేశారు. అనంతరం టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షులు వైద్య విఠల్ మాట్లాడుతూ ఆర్ఎంపీ, పీఎంపీల సమస్యలపై కలవగానే వెంటనే పరిష్కారానికి హామీ ఇచ్చిన రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో ఉన్నటువంటి ఆఎంపీ, పీఎంపీలకు ప్రత్యేక సర్టిఫికెట్‌లను ఇవ్వడానికి ఒప్పుకున్నారని పేర్కొన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నటువంటి జీఓను సవరించడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొనడం పట్ల ఆర్ఎంపీ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆర్ఎంపీలపైన దాడులు ఆపుతామని తెలపడం హర్షనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో బేల, జైనథ్ మండల ఆర్ఎంపీలు కృష్ణ, సుభాష్ ఉరాడే, ఏనుగు సూర్యకాంత్‌రెడ్డి, రూపేష్ బన్కర్, మారుతీ, దేవిదాస్ పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

వర్షాకాలంలో ప్రబలే వివిధ సీజనల్ వ్యాధుల నివారణకై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అదనపు వైద్యాధికారి కుడ్మెత మనోహర్ సూచించారు. శుక్రవారం డ్రై డేలో భాగంగా మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల (బాలికలు)లో డ్రై డేను నిర్వహించారు. ఈ సందర్భంగా దోమల నివారణ మందును పిచికారి చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వసతి గృహాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా మురుగుతో పాటు నీటిని నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి పథకాలకు క్లోరినేషన్ చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాస్, తులసీదాస్ ఆశవర్కర్‌లు పాల్గొన్నారు.

విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఉట్నూర్

విద్యార్థులకు నాణ్యమైన ప్రమాణాలతో కూడిన విద్యనందించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేబి కాంప్లెక్స్‌లోని స్పోర్ట్స్ స్కూల్‌ను ఆకస్మికంగా సందర్శించి, తనిఖీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో అందిస్తున్న విద్య, వైద్య భోజన సదుపాయాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో పాటు క్యూలో నిలబడి పల్లెంలో ఆహారం తీసుకొని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజు మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలని సూచించారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలనీ అన్నారు. నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూం, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థికి



చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. వర్షాకాలంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని సూచించారు.విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కారిస్తామని తెలిపారు. అనంతరం ఐటీఐ కళాశాలను సందర్శించారు. కళాశాలలో గల పరికరాలు, యంత్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్ద ఉన్న ఆర్టీసీ బస్‌స్టాప్ వద్ద ఆర్టీసీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రయాణికులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డుపై పాటించాల్సిన సూచనలను తప్పకుండా పాటించాలన్నారు. మోటార్ బైక్ నడపేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని అన్నారు. హెవీ మోటర్ డ్రైవింగ్ శిక్షణ తరగతుల గురించి యువకులకు వివరించారు. పాఠశాలలు ప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులు బస్సు పాస్‌లు తీసుకోవాలని, ప్రయివేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించాలని అన్నారు. ఆర్టీసీ గమ్యం యాప్ గురించి వివరిస్తూ ప్రయాణికులకు ఇన్‌స్టాల్ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎడీసీ ఏం.నారాయణ, ఎస్టీఐ యూసఫ్, విలేజ్ బస్ ఆఫీసర్ సీ.సతీష్ పాల్గొన్నారు.

అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేజీబీవీ కళాశాలలో, పాఠశాలల్లో బోధించేందుకు దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో సర్టిఫికెట్ వేరిఫికేషన్ ప్రక్రియ నిర్వహించారు. కేజీబీవీ సెక్టోరల్ అధికారి ఉదయశ్రీ అభ్యర్థుల సర్టిఫికెట్‌లను పరిశీలించి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా సెక్టోరల్ అధికారి మాట్లాడుతూ కేజీబీవీ కళాశాల, పాఠశాలలో బోధన సిబ్బందిని నియమించేందుకు ఇటీవల నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. దరఖాస్తులు అభ్యర్థుల నుంచి 1 పోస్టుకు ముగ్గురు చొప్పున సర్టిఫికేట్ల వేరిఫికేషన్‌కు పిలవడం జరిగిందని తెలిపారు. గత సంవత్సరం మిగిలిన క్యారిఫార్వర్డ్ 13 పోస్టులు మినహా మిగలిన 7 పోస్టులకు దరఖాస్తులను స్వీకరించామని అన్నారు. వెరిఫికేషన్ అనంతరం కమిటీ అభ్యర్థులను ఫైనల్ చేస్తుందని తెలిపారు. ఫైనల్ అయిన వారికి రెండు రోజుల్లో అర్డర్ కాపీలు ఇస్తామని స్పష్టం చేశారు.

రైతులతో రుణమాఫీ సంబరాలు



నవతెలంగాణ-బేల

మండల కేంద్రంతో పాటు చప్రాల గ్రామంలో శుక్రవారం ఘనంగా రుణమాఫీ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. ఎడ్లబండి ఎక్కి సందడి చేశారు. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకేసారి రూ.31 వేల కోట్ల రుణమాఫీ చేయడం చరిత్రలో మొదటిసారని అన్నారు. ఏకకాలంలోనే వేల కోట్ల రూపాయాలను రుణమాఫీ చేయడం చారిత్రాత్మకమని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఇచ్చిన మాటకు కట్టుబడి ఐదు గ్యారంటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతో సుమారు 7 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమచేసి వారి ముఖాల్లో సంతోషాలు నింపారన్నారు. రైతు పక్షపాతి ప్రభుత్వంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. రైతు రాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఇదివరకే ఉచిత బస్సు ప్రయాణంతో పాటు గృహజ్యోతి కింద 200 యూనిట్ల వరకు విద్యుత్ సరఫరా, ఐదు వందల రూపాయలకే గ్యాస్ సిలిండర్ వంటి ఎన్నో కార్యక్రమాలను అమలు చేస్తూ, ప్రజల అభిమానాన్ని చూరగొంటోందన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మెన్ అడ్డి భోజారెడ్డి, బాయిన్‌వార్ గంగారెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు ఫైజుల్లా ఖాన్, మాజీ జెడ్పీటీసీ రాందాస్ నాక్లే, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు సంజయ్ గుండావార్, వామన్ వాంఖడే, మడావి చంద్రకాంత్, దౌలత్‌రావ్, ఆడే శంకర్, రూప్ రావు వాంఖడే, విలాస్ పాటిల్, సాగర్ ఠాక్రే, శంకర్ భోక్రే, అవినాష్ గోడే, విపిన్ ఠాక్రే, మండల నాయకులు పాల్గొన్నారు.


బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



నవతెలంగాణ-ముధోల్

మండలంలోని చించాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన, నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గ్రామస్తులు, ఎస్‌టీయూ నాయకులు ఉపాధ్యాయులు అందించిన సేవలను వారు కొనియాడారు. సుమారు 12 సంవత్సరాల పాటు పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీ కావడంతో బాధగా ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సన్మాన కార్యక్రమంలో బదిలీ అయిన ఉపాధ్యాయులు బసవరాజు, భోజభాయి, వనజ, అనిల్, గంగాధర్‌తో పాటు ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు జుట్టు గజేందర్, భూమన్న యాదవ్, రాజేశ్వర్, రవి యాదవ్, రాజరెడ్డి, నరసింహ చారి, తోట గంగాధర్‌తో పాటు గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎఐటీయూసీ) వర్కింగ్ ప్రెసిడెంట్ సిర్ర దేవేందర్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేశారు. పారిశుధ్య రెగ్యులర్ కార్మికుల ఖాళీలను అవుట్ సోర్సింగ్ కార్మికులతో భర్తీ చేయాలని అన్నారు. కార్మికులకు ప్రతినెల 5వ తేదీ లోపు వేతనం చెల్లించాలన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, పారిశుధ్య కార్మికులకు ప్రతి మూడు నెలలకు ఒకసారి మెడికల్ చెకప్ చేయించాలని అన్నారు. అవుట్ సోర్సింగ్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అప్పటివరకు రూ.26వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విలాస్, చిరంజీవి, కాంతారావు, కార్మికులు ఉన్నారు.

హామీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయిన వాటిని పూర్తిస్థాయిలో కాంగ్రెస్ అమలు చేయలేదని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎస్టీయూ భవనంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు బ్రహ్మానంద్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎన్రాల నగేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు ఏ కష్టాలైతే ఎదుర్కొన్నారో కాంగ్రెస్ హయంలో కూడా అలానే జరుగుతుందన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో గెలుపు కోసం వాగ్దానాలు, హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత విస్మరించిందని ఆరోపించారు. ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చెప్పి ఇప్పటి వరకు చేయలేదని, 200 ఉచిత కరెంట్



సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. 201, 210 యూనిట్లు వచ్చిన మొత్తం బిల్లు వసూళ్ల చేస్తున్నారన్నారు. శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి బ్రహ్మరథం చేపట్టారన్నారు. కానీ రాష్ట్రంలో అధికారంలోకి రాలేదని, పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేసేలా బీజేపీ ఉద్యమిస్తుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆధినాథ్, వేణుగోపాల్, అకంత్ రమేష్, బోయర్ విజయ్, మయూర్ చంద్ర, లాలామున్న, ధోని జ్యోతి, సునంద రెడ్డి, సుభాష్, రవి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌కు స్థల పరిశీలన

నవతెలంగాణ-ముధోల్

మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ ఏర్పాటు కొరకు శుక్రవారం ముధోల్‌లోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ పాఠశాల ఆవరణ స్థలాన్ని నిర్మల్ జిల్లా ఆడిషనల్ కలెక్టర్ కిశోర్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా భైంసా ఆర్డీఓ కోమల్‌రెడ్డి, స్థానిక తహసీల్దార్ విఠల్‌కు పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట, ఆర్ఐ నారాయణ ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్, ఆదిలాబాద్‌రూరల్

పట్టణంలోని ఖానాపూర్, కైలాస్‌నగర్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే 33/11కేవీ ఉపకేంద్రం జీఎస్ నగర్‌లో మరమ్మత్తులు కారణంగా శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. దీనివల్ల పట్టణంలోని ఖానాపూర్, సోనార్ గల్లీ, బొక్కలగూడ, కోలిపురా, మసూద్‌చౌక్, ధన్‌గర్ గల్లీ, శాంతినగర్, ఓల్డ్ హౌసింగ్ బోర్డు, ఆర్ఆర్ కాలనీ, అటెండర్స్ కాలనీ, ఏరోడ్రమ్ రోడ్, వాల్మీకి నగర్, కుమ్మరివాడ, గణేష్ నగర్, రాంపూర్, పొచ్చర, దిమ్మ, జందాపూర్, బీంసరి ఏరియాలలో విద్యుత్తు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులందరు సహకరించాలని కోరారు.

నార్నూర్ : నేడు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మండలంలోని సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ మరమ్మతు పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించి, విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

నవతెలంగాణ

కుమురంభీం ఆసిఫాబాద్

శనివారం జులై 20, 2024 www.navatelangana.com

మాస్టర్ మైండ్స్ పోస్టర్లు ఆవిష్కరించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆసిఫాబాద్



జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే మాస్టర్ మైండ్స్ పదవ తరగతి విద్యార్థుల ఆన్‌లైన్ తరగతికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను కలెక్టర్ వెంకటేష్ దోత్రె, జిల్లా విద్యాధికారి అశోక్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులకు మాస్టర్ మైండ్స్ ద్వారా నిర్వహించే గూగుల్ మీట్ తరగతులు ఎంతగానో దోహదపడతాయన్నారు. పదో తరగతి విద్యార్థులంతా గూగుల్ మీట్‌లో చేరి లబ్ధి పొందాలన్నారు. మాస్టర్ మైండ్స్ విజయగాదని తెలిపే పుస్తకాన్ని రాసిన కోఆర్డినేటర్ ధర్మపురి వెంకటేశ్వర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధుకర్ పాల్గొన్నారు.

వర్షావాత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- డీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మౌల్కార్ అశోక్

నవతెలంగాణ-వాంకిడి

రానున్న ఆదివారం నుండి ఆషాడ పూర్ణిమ నుంచి అశ్విని పూర్ణిమ వరకు 90 రోజుల వరకు వర్షావాత్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని డీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు మౌల్కార్ అశోక్ అన్నారు. మండల కేంద్రంలో జశ్వంత్ బుద్ధవిహార్‌లో ప్రతి సంవత్సరం లాగా ఈ సంవత్సరం కూడా వర్షావాత్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అంబేద్కర్ యువజన సంఘం, సిద్ధార్థ యువజన సంఘం, రమాబాయి మహిళ మండలి సంఘం అందరు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వర్షావాత్ కార్యక్రమానికి జశ్వంత్ బుద్ధవిహార్‌లో ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందన్నారు.

మొక్కను బతికిస్తే అవి బతుకు నిస్తాయి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మొక్కలను బతికిస్తే అవి మనకు ఎన్నో జన్మల బతుకునిస్తాయని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని పీటీజీ గురుకులం, గిరిజన గురుకుల బాలికల కళాశాలలో నిర్వహించిన 75వ వన మహోత్సవం కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పాఠశాలకు వచ్చిన కలెక్టర్‌కు పీటీజీ విద్యార్థులు బ్యాండ్‌తో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొక్కలు మానవాళికి జీవధారమని వాటిని బతికించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వన మహోత్సవంలో భాగంగా జిల్లాలో 53 లక్షలు మొక్కలు నాటే విధంగా లక్ష్యం పెట్టుకున్నట్లు, అందులో ఇప్పటివరకు 35 శాతం చేరుకున్నట్లు తెలిపారు. మొక్కలు రెండు వరసలో నాటితే పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి శాఖ వారికి కేటాయించిన లక్ష్యాన్ని చేరుకునేలా పనిచేయాలని సూచించారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ సురేందర్, డీపీఓ బిక్షపతి, డీటీడీఓ రమాదేవి, ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్ భుజంగరావు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్ ఆరోగ్య సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఎంపీడీఓ అల్బర్ట్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆస్పత్రిలో రోగులకు సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎలుకపెల్లి గ్రామ పంచాయతీలో వన మహోత్సవం సందర్భంగా మొక్కలను నాటారు. అనంతరం ఎలుకపెల్లి ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించి మధ్యాహ్నభోజనం ఏ విధంగా ఉందో చూసి నిర్వాహకులకు పరిశుభ్రతను పాటించాలని, నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అర్షియా, ఎఫ్ఆర్ఓ సుధాకర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయనిర్మళ, అటవీ శాఖ అధికారులు, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

- ఆసిఫాబాద్ ఎస్పీ డివి శ్రీనివాసరావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్నామని ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్రంలోని డీపీఓ కార్యాలయంలో జిల్లా అదనపు ఎస్పీ ప్రభాకరరావుతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంతో పాటు కాగజ్‌నగర్, జైనూర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పోలీస్ యాక్ట్ 30 అమలుకు సంబంధించి ఎవరు ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని ఎటువంటి అల్లర్లు జరగకుండా మాత్రమే దీనిని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ర్యాలీలు, ధర్నాలు చేస్తే తమకు ముందస్తు సమాచారం అందించాలనేది ఈ ఆక్ట్ ఉద్దేశమని వివరించారు. డ్రగ్స్ నివారణ కోసం అన్ని చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఎక్కడైనా మాదకద్రవ్యాలు వాడినట్లు, అమ్మినట్లు, కొన్నట్లు సమాచారం తెలిస్తే పోలీసులకు తెలియజేయాలని కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో భాగంగా 32 మంది బాల కార్మికులను గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో ప్రజలు తమకు సహకరించాలని కోరారు. నేరాలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు మీడియాకు తెలిపేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఈ కార్యక్రమంలో టాస్క్ ఫోర్సు సీఐ రాణా ప్రతాప్, రిజర్వ్ ఇన్స్‌పెక్టర్ పెద్దన్న ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్యాంకుల్లో హడావుడి

నవతెలంగాణ-వాంకిడి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.రెండు లక్షలు రుణమాఫీ చేయడంతో ఎస్‌బీఐ, తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉదయం నుండే రైతులు తమతమ ఖాతాలో డబ్బులు పడ్డాయా లేదా అని గుంపులుగుంపులుగా బ్యాంకుల వద్ద చేరుకున్నారు. ఇటు పడిన వారు, పడని వారు కూడా ఎన్ని డబ్బులు పడ్డాయి, డబ్బులు ఎన్ని ఉన్నాయి, రెన్యూవల్ చేయడం కోసం ఉదయం నుండే బ్యాంకుల వద్ద పడిగాపులు కాస్తున్నారు.

అతివకు అందలం

- మహిళా సాధికారతకు రుణాలు
- కొత్త సభ్యులు చేరేలా విస్తృత ప్రచారం
- లక్ష్య సాధన దిశగా ఐకేపీ అధికారుల కసరత్తు
- ఈ ఏడాది వార్షిక లక్ష్యం రూ.14 కోట్లు

ప్రభుత్వం మహిళల అభ్యున్నతికి పెద్దపీట వేస్తోంది. వారికి సకల సదుపాయాలు కల్పించడంతోపాటు వ్యాపార పరంగా రాణించేందుకు అనేక రకాల అవకాశాలు కల్పిస్తోంది. సంక్షేమ ఫలాలు మరికొంతమందికి అందించాలనే ఉద్దేశంతో నూతన సభ్యత్వాలు. నూతన పొదుపు సంఘాలను ప్రోత్సహించే దిశగా ఐకేపీ అధికారులు అడుగులు వేస్తున్నారు. నూతన సభ్యత్వాలు, చిన్న సంఘాల ఏర్పాటు ప్రక్రియ నిరంతరం కొనసాగుతున్న నేపథ్యంలో ప్రతి మహిళకు సభ్యత్వం ఉండేలా కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇందుకు లక్ష్యాల ను సైతం విధించడం విశేషం.



నవతెలంగాణ-కెరమెరి

మండలంలోని 31 గ్రామ పంచాయతీల్లో 470 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో మొత్తం 4500 మంది సభ్యులు ఉన్నారు. అయితే ఇప్పటి వరకు ఏ సంఘాలలో లేని వారిని గుర్తించి సభ్యత్వం కల్పించేలా స్వయం సహాయక సంఘాల ప్రతినిధులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా యాక్టీవ్‌గా ఉన్న సంఘాలతో పాటు కొత్త సంఘాలను ఏర్పాటు చేసి ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేలా తోడ్పాటును అందించనున్నారు.

కొత్త కోడళ్ళకు అవకాశం

లక్ష సాధనలో గ్రామాల వారీగా కొత్తగా సంఘంలో సభ్యులను చేర్పిస్తున్నారు. ఇందుకోసం అధికారులు ఐకేపీ అధికారులు వివిధ రకాల ప్రణాళికలను రూపొందిస్తూ కసరత్తు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ప్రతి గ్రామాన్ని అనే సందర్శించి 60 ఏండ్లు దాటిన సభ్యులకు ఆయా సంఘాల నుంచి సభ్యత్వాన్ని రద్దు చేస్తుండంతో కొత్తగా వారిని చేర్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఈ ఏడాది 340 మందికి సభ్యత్వం ఇవ్వాల్సిన లక్ష్యం కాగా మండలంలో ఇప్పటివరకు 5 సంఘాలు, దాదాపు 55 మంది సభ్యులను చేర్పించారు. మరో 285 మందిని మార్చి నాటికి చేర్పించాల్సి ఉంది. ఇందులో ఎక్కువగా కొత్త కొడళ్లని, సంఘాల్లో లేని వారిని సంఘాల్లో చేర్పిస్తున్నారు.

మహిళా అభ్యున్నతికి కృషి

మహిళలను ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఐకేపీ అధికారులు. సరికొత్త ప్రయోగాలు చేస్తున్నారు. సభ్యులకు బ్యాంకు లింకేజీ, శ్రీనిధి రుణాలను అందిస్తూ చేయూతనిస్తున్నారు. ఇందు కోసం సంబంధిత అధికారులు స్థానికంగా అంతకు ముందున్న గ్రామ సామ్యక్య సంఘాల సహకారం తీసుకొని నూతన సభ్యులను చేర్పించే ప్రక్రియకు పూనుకున్నారు.

470 సంఘాలు రూ.14 కోట్ల రుణాలు

ఈ ఏడాది మండలంలోని యాక్టివ్‌గా ఉన్న 470 స్వయం సహాయక సంఘాలకు రూ.14 కోట్ల రుణాలు అందించనున్నారు. ఇందులో ఇప్పటికే 59 సంఘాలకు రూ.1 కోటి 97లక్షలను అందించారు. మార్చినాటికి ప్రభుత్వ లక్ష్యాలను పూర్తిచేసేలా స్వయం సహాయక సంఘాల సీసీలు, గ్రామ దీపికలు, గ్రామ సమైక్య అధ్యక్షులు రుణాలు ఇప్పించేందుకు విస్తృత ప్రచారం చేస్తున్నారు. దీంతో మండలంలోని పలు గ్రామాల మహిళలుతో మండల కేంద్రంలోని బ్యాంకు వద్ద సందడి నెలకొంటుంది.

విస్తృత ప్రచారం చేస్తున్నాం

దుర్గం శంకర్, సీసీ కెరమెరి

మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలపై విస్తృత ప్రచారం చేస్తున్నాం. అందుకు కొత్తగా వచ్చే కోడలును సైతం సభ్యులుగా చేర్చుకునేందుకు ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. కొత్త సభ్యులు చేరికగా మంచి స్పందన వస్తుంది. పేద మహిళల అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తాం

మహిళలు సద్వినియోగం చేసుకోవాలిలి

జగదీశ్వర్, ఐకేపీ ఏపీఎం, కెరమెరి



నూతన సంఘాలతో సభ్యులను చేర్పించేందుకు అవకాశం కల్పించారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. రుణాలు పొంది ఆర్థిక అభివృద్ధి సాధించారు. ఏడాది మండలంలో రూ.14,44 కోట్లు లక్ష్యంగా రుణాలను మార్చినాటికి అందించేలా కృషి చేస్తాం.

ఐకేపీ వీఓఏల సమస్యలు అసెంబ్లీలో ప్రస్తావించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రానున్న అసెంబ్లీ సమావేశాల్లో ఐకేపీ వీఓఏల సమస్యలు ప్రస్తావించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ కోరారు. ఐకేపీ వీఓఏతో కలిసి ఎమ్మెల్యే కోవలక్ష్మి కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఓఏలకు రాష్ట్ర ప్రభుత్వం మేనిఫెస్టోలో చూపిన విధంగా వేతనాలు చెల్లించాలన్నారు. గ్రేడింగ్‌తో సంబంధం లేకుండా వ్యక్తిగత ఖాతాలో వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రతి గ్రామ సంఘానికి ల్యాప్టాప్ అందజేయాలని, కనీస వేతనం రూ.26,000 ఉండేలా చూడాలన్నారు. అర్హులైన వారికి సీసీలుగా పదోన్నతి కల్పించాలన్నారు. సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి గుర్తింపు కార్డులు మంజూరు చేయాలన్నారు. ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యే స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో ఫోన్‌లో మాట్లాడగా అసెంబ్లీలో తప్పకుండా సమస్యలపై మాట్లాడతానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీఓఏల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రమ, జ్యోతి, ఉపాధ్యక్షులు సంతోష్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షుడు బుద్దు, నాయకులు సుదర్శన్, రమేష్, లక్ష్మి, ఓమాజీ, కల్పన, పద్మ, వినోద్, ఫర్జానా, కవిత పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల డిమాండ్లు పరిష్కరించాలి

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్
- ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం ఎన్నికల్లో ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ డిమాండ్ చేశారు. సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే ఇంటి ముందు ధర్నా నిర్వహించి, అనంతరం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్న ఆశలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. వారికి నిర్వహించ తలపెట్టిన పరీక్షలు రద్దు చేయాలన్నారు. స్థిర వేతనం రూ.18000 అమలు చేయాలన్నారు. పదవి విరమణ ప్రయోజనాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్ల సమస్య పరిష్కారంపై నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. రోజువారి పనులు కాకుండా అదనపు పనులు కేటాయించినప్పుడు అదనపు మొత్తాలు చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం చొరవ తీసుకోవాలని, ప్రభుత్వం స్పందించకుంటే రానున్న రోజుల్లో ఉద్యమం ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం నాయకులు లక్ష్మీ, నవీన, భారతి, దేవి, పద్మ, పార్వతి, రూప, రేణుక పాల్గొన్నారు.

బ్యాంకు నూతన మేనేజర్‌గా బాధ్యతలు

నవతెలంగాణ-వాంకిడి

మండలలంలో దక్కన్ గ్రామీణ బ్యాంకు నూతనన మేనేజర్‌గా జాడి కృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో గోలేటిలో పనిచేసి బదిలీపై వాంకిడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన మేనేజర్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో కృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అన్ని వేళలో అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మండలంలోని గుండెపల్లి, కమ్మర్గాం గ్రామంలో గల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆర్షిన్ విద్యార్థులకు, గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షలకు 96 మంది హాజరై పరీక్షలు నిర్వహించుకున్నారు. గ్రామస్థులకు పరిసరాల పరిశుభ్రతపై, సీజన్‌లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించారు. అనార్తి హల్దర్, విక్టోరియా, నాగరాజు, ధర్మారావు, లక్ష్మీ, రాధ పాల్గొన్నారు.

మండలంలోని పలు గ్రామాల్లో భారీ వర్షం



నవతెలంగాణ-దహెగాం

మండలంలో గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. అర్ధరాత్రి నుండి కురిసిన భారీ వర్షానికి వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహించాయి. చిన్నరాస్పెల్లి గ్రామానికి చెందిన రామగుండం సంజీవ్ ఇల్లు, ఇంటి గోడలు పాక్షికంగా కూలిపోయాయి. అలాగే చాలా గ్రామాల్లో పంట చేన్లు నీట మునగగా పత్తి మొక్కలు కొట్టుకుపోయాయి.

భారీ వర్షానికి తెగిన చెరువు మత్తడి

పెంచికల్‌పేట్ : మండలంలో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొండపెల్లి గ్రామ శివారులో గల పెద్ద చెరువు మత్తడి కొట్టుకుపోయి చెరువులోని నీరంతా బయటకు ప్రవహించింది. మండలంలో మత్తడి కొట్టుకుపోవడంతో చెరువు కింద సాగు చేసే వంద ఎకరాల ఆయకట్టు పొలాలకు నీరందకుండా పోతుంది. మండలకేంద్రంలో బెజ్జూరుకు వెళ్లే ప్రధాన రహదారిపై ఒర్రెలు ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాలకు మండలంలోని వాగులు, వంకలు, ఒర్రెలు ప్రవహిస్తున్నాయి.

రుణమాఫీలో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఇస్తున్న పంట రుణమాఫీలో వారికి ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూడాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంటుందని ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌ను అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, ఎల్‌డీఎం జోషి మండల వ్యవసాయ అధికారి ఖాదర్ హుస్సేన్‌తో కలిసి సందర్శించారు. అక్కడ రైతులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మేనేజర్‌తో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పంట రుణమాఫీ విషయంలో రైతులను ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. వారికి ప్రస్తుతం ఉన్న రుణం ఖాతాలోనే మాఫీ మొత్తాన్ని జమ చేయాలని సూచించారు. దీనికోసం బ్యాంకర్లు పూర్తిస్థాయిలో సహకరించాలని అన్నారు. రుణమాఫీ విషయంలో తనవరకు ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూడాల్సిన బాధ్యత బ్యాంకర్లపై ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రాకపోకలకు మరింత అంతరాయం

- భారీ వర్షానికి కుంగిపోయిన అప్రోచ్ రోడ్డు
- ఆటోలకు మాత్రమే అనుమతి



నవతెలంగాణ-దహెగాం

మండలకేంద్రం నుండి కాగజ్‌నగర్‌కు వెళ్లే ప్రయాణికులకు మళ్లీ ప్రయాణపు పాట్లు తప్పడంలేదు. అందవెల్లి వద్ద పెద్దవాగు వంతెన నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా అప్రోచ్ రోడ్డు నిర్మాణం పూర్తికాకపోవడంతో అవస్థలు తప్పడంలేదు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి అప్రోచ్ రోడ్డు కోసం పోసిన మట్టి మరింతగా కుంగిపోవడంతో కేవలం ఖాళీ ఆటోలు, ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నారు. దీంతో కారులు, జీపులు, ఇతర బరువు గల లోడ్‌తో వచ్చిన ఆటోలను సైతం అనుమతించకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడంలేదు. అప్రోచ్ రోడ్డుకు తాత్కాళిక మట్టి పోసి నెల రోజులు గడిచిపోయింది. కాంట్రాక్టర్ నిర్లక్ష్యం వల్ల పూర్తిస్థాయిలో అప్రోచ్ రోడ్డు పని పూర్తికాక మూడు మండలాల ప్రజలు అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. మరో భారీ వర్షం కురిసినట్టయితే పూర్తి మట్టి కొట్టుకుపోయే ప్రమాదం ఉందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయి అప్రోచ్ రోడ్డు నిర్మాణం చేపట్టి వంతెనను అందుబాటులో తేవాలని ఆయా మండలాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

సిబ్బంది కుటుంబాలకు అండగా ఉంటాం

- ఆసిఫాబాద్ ఎస్పీ డివి శ్రీనివాసరావు
- హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విధి నిర్వహణలో మరణించిన పోలీస్ అధికారుల కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్పీ డివి శ్రీనివాసరావు తెలిపారు. కాగజ్‌నగర్ డివిజన్‌లోని ఈస్గాం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి గత డిసెంబర్‌లో గుండెపోటుతో మరణించిన దయానంద్ కుటుంబానికి పోలీస్ శాఖ తరపున రావలసిన రూ.ఎనిమిది లక్షలు భద్రత చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన పోలీసుల కుటుంబాలకు ప్రభుత్వం తరపున అందవలసిన అన్ని రకాల ఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా కుటుంబంలో అర్హత గల వ్యక్తికి ప్రభుత్వ ఉద్యోగం వచ్చేలా కృషి చేస్తానని బాధిత కుటుంబ సభ్యులకు భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ప్రభాకర్ రావు, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓ శ్రీనివాస్, పోలీస్ సంఘం అధ్యక్షుడు ఎం విజయ శంకర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ అజయ్ వర్మ, బాధితురాలు విజయ పాల్గొన్నారు.

పద్ధతి మార్చుకోవాలి : డీసీపీ భాస్కర్



నవతెలంగాణ-మంచిర్యాల

పాత నేరస్తులు తమ పద్ధతి మార్చుకోవాలని డీసీపీ భాస్కర్ అన్నారు. గంజాయి అమ్ముతూ పట్టుబడి పలు కేసుల్లో నిందితులుగా ఉన్న నేరస్థులకు డీసీపీ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు గతంలో గంజాయి అమ్ముతూ పట్టుబడి పలు కేసుల్లో నిందితులుగా ఉన్న వారిపై ప్రత్యేక దృష్టి ఉంటుందన్నారు. ఇప్పటికైనా అసాంఘిక కార్యకలాపాలు మానుకొని మంచి నడవడికతో జీవించాలని సూచించారు. పద్ధతి మార్చుకోని వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని తెలిపారు. జిల్లాలోని నేరస్థులపై పోలీసులు నిఘా పెట్టారని, డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు పని చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఏసీపీ ఆర్.ప్రకాష్, సీఐ బన్సీలాల్ పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలిచేదే కాంగ్రెస్

నవతెలంగాణ-జన్నారం



రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కిష్టాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు బండారి స్వామి అన్నారు. రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం గ్రామంలోని రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో రూ.2 లక్షల రుణమాఫీని పూర్తి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు అండగా నిలవాలని కోరారు. ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మద్యం దుకాణంలో దొంగతనం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా బస్టాండ్ సమీపంలోని హరిహర మద్యం దుకాణంలో దొంగతనం జరిగింది. దుకాణం నిర్వాహకులు శుక్రవారం షాప్ తెరవడంతో దుకాణం పైకప్పు పగిలి ఉంది. దొంగతనం జరిగిందని గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారాన్ని అందించారు. శ్రీరాంపూర్ సీఐ మోహన్, ఎస్ఐ సంతోష్ ఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాలు పరిశీలించారు. కెమెరాల్లో దొంగ తనానికి పాల్పడ్డ వ్యక్తి కనిపించినప్పటికి అతని వివరాలు మాత్రం తెలియరాలేదు. ఇట్టి విషయమై ఎస్ఐ సంతోష్‌ను వివరణ కోరగా మద్యం దుకాణం యజమాని ఎలాంటి పిర్యాదు ఇవ్వలేదని పేర్కొన్నారు. దొంగతనం జరిగినప్పటికీ పిర్యాదు ఇవ్వకపోవడం గమనార్హం.

'నాకు రుణమాఫీ కాలేదు'

నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కిష్టాపూర్ గ్రామానికి చెందిన చిందం రాజమౌళి అనే రైతుకు ఇందంపల్లి గ్రామీణ బ్యాంకులో రూ.45 వేల అప్పు తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష లోపు రుణమాఫీ చేసిన లిస్టులో తన పేరు లేకపోవడంతో ఆ రైతు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం స్థానికంగా మీడియాకు తన గోడును వినిపించాడు. అర్హతలు ఉన్నప్పటికీ మాఫీ కాలేదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులను అడిగితే, ఆ లిస్టు మేము తయారు. చేయలేదని సమాధానం ఇస్తున్న అన్నారు. బ్యాంకు అధికారులను అడిగితే, ఆ లిస్టుకు మాకు సంబంధమే లేదని అంటున్నారని వాపోయారు. తన గోడును ఎవరికి చెప్పుకోవాలని ఆందోళన చెందుతున్నారు. అందరిలాగే తనకు కూడా రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు.

గాలివాన బీభత్సం..
నేలకొరిగిన భారీ వృక్షాలు



నవతెలంగాణ-వేమనపల్లి

మండలంలో అర్ధరాత్రి సమయంలో గాలివాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఏకధాటిగా కురిసిన వర్షంతో రోడ్డు పక్కన ఉన్న చెట్లు విరిగి పడ్డాయి. నీల్వాయి-మల్లంపేట ప్రధాన రహదారి వెంబడి ఉన్న కల్వర్టు సమీపంలో భారీ వృక్షాలు రోడ్డుకు అడ్డంగా నేలకొరగడంతో వాహనదారులకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నీల్వాయి ఎస్ఐ శ్యామ్ పటేల్ సంఘటన స్థలానికి చేరుకొని జేసీబీ సహాయంతో రోడ్డుకు అడ్డంగా పడ్డ చెట్లను తొలగించే వరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అడవిలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. బలంగా వీచిన గాలికి పలు గ్రామాల్లో ఇంటి పైకప్పులు లేచిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరగడంతో కరెంట్ సరఫరాను నిలిపివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

తహసీల్దార్‌కు ముదిరాజ్ సంఘం వినతి



నవతెలంగాణ-జన్నారం

ముదిరాజులు ఎదుర్కొంటున్న సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లాలని శుక్రవారం ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు గరిగంటి కొమురయ్య, రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, మండల అధ్యక్షుడు దండవేణి శ్రీధర్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముదిరాజు కులస్తులు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అన్ని రంగాలలో వెనుకబడి ఉన్నారని, కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం ముదిరాజు కులస్తులను బిసి-డి నుంచి బీసీ ఏ లోకి పునరుద్ధరణ చేసి తక్షణమే దానిని బిసి ఏ లోకి మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ముత్యాల నరసయ్య, ఐలవేణి రవి, చంద్రమౌళి, ఐలవేణి నరసయ్య, అశోక్, కిరణ్, సంతోష్, నాగరాజ్, గణేష్, అనిల్, శ్రీనివాస్, రవికుమార్, శేఖర్, భీమరాజు, రాజన్న, అశోక్ పాల్గొన్నారు

రైతులకు అండగా నిలిచేది కాంగ్రెసే

నవతెలంగాణ-జన్నారం

రైతులకు అండగా నిలిచేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కిష్టాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకుడు బండారి స్వామి అన్నారు. రుణమాఫీపై హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం గ్రామంలోని రైతులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలో రూ.2 లక్షల రుణమాఫీని పూర్తి చేస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు అండగా నిలవాలని కోరారు. ఆరు గ్యారెంటీలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

21 లోపు దరఖాస్తులు చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం

పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉన్న వివిధ కోర్సులలో ప్రవేశానికి జులై 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపల్ పి శ్రీనివాస్ కోరారు. కళాశాలలోని వివిధ ఐటీఐ కోర్సులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే గడువును ప్రభుత్వం పొడిగించిందన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన విద్యార్థులు జూలై 21వ తేదీలోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

సదరం సర్టిఫికెట్లకు వికలాంగుల కష్టాలు

నవతెలంగాణ-మంచిర్యాల



ఒకవైపు వికలాంగుల సదరం సర్టిఫికెట్ పొందేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న మంచిర్యాల జిల్లాలో మాత్రం సదరం సర్టిఫికెట్లు పొందడానికి వికలాంగుల అరిగోస పడుతున్నారు. స్లాట్ బుకింగ్ చేసుకోవడం నుంచి మొదలు సర్టిఫికెట్ పొందేందుకు వికలాంగులు పడే కష్టం అంత ఇంత కాదు.స్లాట్ బుకింగ్ అయినప్పటికీ డాక్టర్ల పరీక్షలు, అధికారులు సంతకాలతో ధ్రువీకరణ పత్రం పొందాలంటే దాదాపు ఒక్కొకరికి 3 నెలల నుంచి 4 నెలలు పడుతుంది. ఒకవేళ సర్టిఫికెట్ వచ్చిన అది 3 లేదా 5 సంవత్సరాల వరకు పరిమితం కావడంతో తిరిగి సర్టిఫికెట్ పొందాలంటే క్యాంపుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. శారీరకంగా నూటికి నూరు శాతం డిసెబిలిటీ ఉన్నప్పటికీ కొందరు డాక్టర్లు లబ్ది దారులను పూర్తిగా పరీక్షించకుండనే డిసెబిలిటీ శాతం నమోదు చేస్తున్నారు. లబ్ది దారులు వాపోతున్నారు. రోజుల తరబడి తిరగ లేక కొందరు అయితే సర్టిఫికెట్ లేకున్నా ఏం కాదులే అనుకొని వదిలేసిన సందర్భాలు ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. మంచిర్యాలలో శుక్రవారం జరిగిన ఆర్థో విభాగానికి సంబంధించిన సదరం క్యాంప్‌లో డాక్టర్లు సమయానికి రాకపోవడంతో వచ్చిన వికలాంగులు డాక్టర్ల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది. ధ్రువీకరణ పత్రం వచ్చినా పింఛన్ రాకపోవడంతో మరి కొందరు అధికారులను కలిసేందుకు బారులు తీరారు. సమయానికి రాని డాక్టర్లు, లబ్ది దారులకు ధ్రువీకరణ పత్రాల పరిశీలనలో తలెత్తే సమస్యలపై మంచిర్యాల ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీష్ చంద్రరెడ్డిని వివరణ కోరగా స్లాట్ బుకింగ్ చేసుకొని వచ్చిన వికలాంగుల వివరాలు నమోదు చేసే వరకు సమయం పడుతుంది. అంత సిద్ధం అయిన డాక్టర్లు వచ్చి పరిక్షిస్తారు. వికలాంగులను పరీక్షించే క్రమంలో డాక్టర్లు చాక చక్యంగా వ్యవహరిస్తారని, ఎటువంటి లోటు పాట్లు జరిగే అవకాశాలు లేవని తెలిపారు.

పుట్టుకతోనే వైకల్యం ఉంది

కునారపు లక్ష్మి, వికలాంగుడి(తల్లి), ఇంధనపెల్లి.

బాబు పుట్టుడే అంగవైకల్యంతో పుట్టాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగిన బాబు మంచిగా కాడని చెప్పారు. బాబుకు ఇప్పుడు 11 సంవత్సరాలు, బాబుకు రెండు సంవత్సరాల వయసు ఉన్నప్పుడు వికలాంగుల సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటే 2019లో ఇచ్చారు. అది కూడా 5 సంవత్సరాలు, మల్లి ఇప్పుడు వచ్చాము. మల్లి గడె 5 సంవత్సరాలకు సర్టిఫికెట్ ఇచ్చారు. అధికారులు, కాళ్ల, చేతులు పడిపోయి లేవలేని స్థితిలో ఉన్నాడు బాబు, అన్నం తినడు, కేవలం పాల తోనే సాదుకుంటున్నాము, శారీరకంగా 100 శాతం సమస్య ఉన్నప్పటికీ సదరం సర్టిఫికెట్‌లో మాత్రం డిసెబిలిటీ శాతం తక్కువగా నమోదు చేయడంతో మల్లి క్యాంప్‌ల చుట్టూ తిరగాల్సి వస్తుంది.

బీడీ కార్మికులకు జీవన భృతి ఇవ్వాలలి



నవతెలంగాణ-నస్పూర్

బీడీ కార్మికులకు జీవన భృతి రూ.4000 ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్టీయూ) ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ మోతిలాల్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్య శివాజీ మాట్లాడుతూ బీడీ పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నదని, కార్మికులకు ఉపాధి కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా బీడీ పరిశ్రమలో పని చేస్తున్న కార్మికులందరికీ జీవన భృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ కార్మికులకు అనేక ఆంక్షలు విధించి, తీవ్ర ఇబ్బందులు కలిగించారని ఆయన తెలిపారు. బీడీ పరిశ్రమను దెబ్బతీయాడానికి నరేంద్ర మోడీ ప్రభుత్వం రకరకాల చర్యలను చేపట్టి, సిగిరేటు కంపెనీలకు ఊడిగం చేస్తుందని, బీడీ కట్టలపై పుర్రె గుర్తు ముద్రించి బీడీ కార్మికుల జీవనోపాదిని దెబ్బ తీస్తూ, సిగరెట్ పరిశ్రమ అదిపతులకు ఊడిగం చేస్తున్నాడని ఆరోపించారు. మోడీ ఎన్నికల్లో ఉపాధి భద్రత, స్వదేశీ పరిశ్రమల పరిరక్షణ, ప్రతి ఏటా రెండు కోట్ల కొలువులు ఇస్తామని వాగ్దానాలు చేసి, కార్మిక వ్యతిరేక విధానాలతో కార్పొరేట్ కంపెనీలకు సేవ చేసిందని ఆయన తెలిపారు. అసెంబ్లీలో నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయడం సాధ్యం కాదని తీర్మానం చేయాలని ఆయన రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు బి.భూమన్న, రాష్ట్ర అధ్యక్షుడు భూమన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్, అరుణోదయ రాష్ట్ర నాయకులు మల్లన్న, నాయకులు మంగ, శ్రీకాంత్, అనిత, బీడీ కార్మికులు శ్రీలత, గంగ భవాని, సుజాత, తిరుమల పాల్గొన్నారు.

బాధితులకు రూ.50లక్షల చొప్పన పరిహారం చెల్లించాలి

నవతెలంగాణ-జైపూర్

• ముఖాముఖిలో గ్రీన్‌ఫీల్డ్ హైవే బాధిత రైతుల డిమాండ్



నాగాపూర్-విజయవాడ మధ్య నిర్మించ తలపెట్టిన గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణంలో నష్టపోతున్న భూములకు ఎకరాకు రూ.50లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే సంబంధిత అధికారులతో కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో భూనిర్వాసితులు స్థానిక స్థితిగతులు వెల్లడిస్తూ పరిహారం చెల్లింపులో మార్కెట్ రేట్ దృష్టిలో పెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలోని రసూల్‌పల్లి నుండి మొదలు గోపాల్‌పూర్ మీదుగా గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మించనుండగా భూములు సమకూర్చనున్న రైతుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకోవాలని కోరారు. రసూల్‌పల్లి నుండి గోపాల్‌పూర్ వరకు గల భూములకు రూ.50 లక్షల నుండి రూ. కోటి ధర పలుకుతోందని వివరించారు. మార్కెట్ రేటు పక్కన పెట్టి ఎకరాకు రూ.8 లక్షల చొప్పున పరిహారం చెల్లిస్తామనడం బాధాకరమన్నారు. గతంలో ఇందారం ఓపెన్‌కాస్ట్ గని విస్తరణలో భాగంగా సేకరించిన భూములక ఎకరాకు రూ.24లక్షల60వేల చొప్పున పరిహారం చెల్లించారని గుర్తు చేశారు. గోదావరి తీర గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన వెంచర్లలో గజం రూ.3 నుండి 5వేల చొప్పున అమ్ముడవుతున్న తీరును అధికారులు పరిగణలోకి తీసుకోవాలని కోరారు. రైతుల డిమాండ్ పట్ల స్పందించిన కలెక్టర్ కుమార్ దీపక్ బాధితులకు న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇస్తూ నిర్వాసితుల నుండి దరఖాస్తులు తీసుకున్నారు. ముఖాముఖిలో వివిధ గ్రామాలకు చెందిన బాధిత రైతులు సుందిల్ల మల్లేష్, ఇప్పలపల్లి బాపు, జనార్ధన్‌రెడ్డి, రామారావు, సుందిళ్ల తిరుపతి, పంచిక శంకర్, బల్ల మొగిలి, కొటం చంద్రయ్య ఉన్నారు.

బీసీల డిమాండ్‌లు పరిష్కరించాలి



నవతెలంగాణ-మంచిర్యాల

బీసీల న్యాయమైన డిమాండ్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం మంచిర్యాల ఐబి చౌరస్తా నుండి లక్షెట్టిపేట వరకు పోరుబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో 40 సంవత్సరాలుగా బీసీ సంఘాల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని ఉద్యమాలు చేస్తున్నప్పటికీ కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు బీసీల డిమాండ్లు పరిష్కరించడంలో పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టి చట్టసభలో బీసీలకు 50శాతం రిజర్వేషన్ కల్పించాలని, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం లాగానే బీసీల సామాజిక రక్షణ భద్రతకు బీసీ యాక్ట్ ఏర్పాటు చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేసే జనగణనలో భాగంగా బీసీల కులగణన చేపట్టాలని, లక్ష కోట్లతో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ బీసీ ఉద్యోగులకు 50శాతం రిజర్వేషన్ అమలు చేయాలని, జనాభా ప్రాతిపదికన బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, కర్రే లచ్చన్న, శ్రీపతి రాములు, చంద్రగిరి చంద్రమౌళి, బండ సతీష్, పంపరి వేణుగోపాల్, పన్నీరు భీమ్‌రావు, కీర్తి భిక్షపతి, నంగునూరు లక్ష్మణ్, రాసమల్ల రాజేశ్వరి, ఆరెందుల రాజేశం, సంగం లక్ష్మణ్, రమేష్ వర్మ, బుడంకి కుమార్, కొంతం రాజు, అంకం సతీష్, మొగిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-కాసిపేట



మండలంలో పీఆర్టీయూటీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాసిపేట, ముత్యంపల్లి, లంబాడీ తాండ(ఎన్), ధర్మారావుపేట, దేవాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు యూపీఎస్ పెద్దనపల్లి, కోనూర్, ప్రైమరీ పాఠశాలలు వెంకటాపూర్, లంబాడితాండ పాఠశాలల్లో సభ్యత్వ నమోదు చేశారు. ఈ సందర్భంగా పీఆర్టీయూటీఎస్ జిల్లా గౌరవాధ్యక్షులు బండ శాంకరి, మండల అధ్యక్షుడు అన్నం రమణారెడ్డి మాట్లాడుతూ బదిలీ అయిన తర్వాత రిలీవ్ కాని ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలిని, 317 జీవోలో ఇతర జిల్లాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే స్థానిక జిల్లాకు బదిలీ చేయాలని, 10,000 ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎం పోస్టులను మంజూరు చేసి ఎస్జీటీలకు న్యాయం చేయాలన్నారు. ప్రమోషన్లలో మిగిలిపోయిన లెఫ్ట్ ఓవర్ ఖాళీ స్కూల్ అసిస్టెంట్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సాంబమూర్తి, జ్యోతి, శ్రీనివాస్, మండల కార్యదర్శి పల్లె కృష్ణ గోపాల్ పాల్గొన్నారు.

వసతిగృహాల సమస్యల పరిష్కారానికి కేవీపీఎస్ పోరాటం



నవతెలంగాణ-జైపూర్

సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల సమస్యల పరిష్కారానికి కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) పోరాటం చేస్తుందని జిల్లా కార్యదర్శి దుర్కె మోహన్ అన్నారు. శుక్రవారం చెన్నూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యా సంవత్సరం మొదలై రెండు నెలలు గడుస్తున్నా వసతిగృహాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. స్టూడెంట్ మేనేజ్మెంట్ హాస్టల్స్, కస్తూరిర్బాగాంధీ విద్యాలయాల్లో నెలకొన్న సమస్యలపై జూలై 20 నుండి జిల్లా కమిటి ఆధ్వర్యంలో అధ్యయన యాత్రలు ప్రారంభించనున్నట్లు తెలపారు. కప్పుకోవడానికి దుప్పట్లు, పెట్టెలు, ప్లేట్లు పంపిణీ చేయకపోవడంతో వసతిగృహాల్లో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. అదేవిధంగా మెస్ చార్జీలు పెంచడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, ఫలితంగా విద్యార్థులకు రుచికరమైన భోజనం సమకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు మూడు వసతి గృహాలకు ఒక్కడే వార్డెన్ ఉండి పర్యవేక్షిస్తున్నందున విద్యార్థుల సమస్యలపై దృష్టి సారించలేకపోతున్నారని, వసతిగృహానికి ఒక్కరు చొప్పున వార్డెన్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న అధ్యయన యాత్రల ద్వారా సేకరించిన సమస్యలపై జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చెన్నూర్ మండల కన్వీనర్ జుమిడి కుమార్, నాయకులు కామెర మధుకర్ పాల్గొన్నారు.

అభ్యసన సామర్థ్యాలకనుగుణంగా బోధన చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలను అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) దీపక్ తివారితో కలిసి ఆకస్మికంగా సందర్శించి రిజిస్టర్లు, సరుకుల నిల్వలు, తరగతి గదులను పరిశీలించి విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు తాజా కూరగాయలతో ఆహారం అందించాలని, కాల పరిమితి ముగిసిన వస్తువులను వినియోగించకూడదని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు. గురుకుల పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అనంతరం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రమాదేవి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, వార్డెన్ చంద్రకళ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి మహిళా శక్తి పథకం

• జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళా శక్తి పథకంలో పాడి పరిశ్రమకు అవకాశం కల్పించడం జరిగిందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) దీపక్ తివారి అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్, రెబ్బెన, వాంకిడి, కాగజ్‌నగర్, సిర్పూర్(టి) మండలాలకు చెందిన డెయిరీ లబ్ధిదారులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విజయ డెయిరీ డైరెక్టర్ మధుసూదన్, పశు వైద్యులు డా. మురళి, స్త్రీ నిధి ఆర్‌ఎం. శ్రీనివాస్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శక్తి పథకంలో భాగంగా డెయిరీ ఫాం కొరకు పాడి పశువులను ఇతర రాష్ట్రం నుండి కొనుగోలు చేసి పాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలని తెలిపారు. ఆసిఫాబాద్ మండలంలో పాడి పశువుల నుండి వచ్చిన కొన్ని లీటర్ల పాలు విజయ డెయిరీకి ఇవ్వవచ్చని, 15 రోజుల్లో సంబంధిత సభ్యుల ఖాతాకు చెల్లింపులు చేస్తామని తెలిపారు. పాడి పశువుల ద్వారా అదనపు ఆదాయం కలుగుతుందని, పశువులకు బీమా చేయించినట్లయితే మరింత లాభం చేకూరే అవకాశం ఉంటుందని తెలిపారు. రుణం పొందిన లబ్ధిదారులు దుర్వినియోగం చేయకుండా ఇతర రాష్ట్రాల నుండి పశువులను తెచ్చుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, పశువుల రవాణా సమయంలో పశువుల బీమా తప్పనిసరిగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రామకృష్ణ, ఏపీఎంలు శ్రీనివాస్, రాజ్‌కుమార్, మహిళా శక్తి ఏపీఎం శ్రీనివాస్, సిసిలు, విఓఏలు పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

నవతెలంగాణ-నార్నూర్



విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ రాజలింగం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎస్టీ బాయ్స్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి సాయంత్రం భోజనం చేశారు. వర్ష కాలం నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలని హాస్టల్ సిబ్బందికి ఆదేశించారు.

కిషన్ మహారాజ్ అకాల మరణం బాధాకరం

- జెడ్పీ మాజీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్

నవతెలంగాణ-ఉట్నూర్

మండల కేంద్రానికి చెందిన కిషన్ మాహారాజ్ అకాల మరణం చాలా బాధాకరమని జెడ్పీ మాజీ చైర్మెన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. శుక్రవారం కిషన్ మహారాజ్ అంతక్రియల్లో పాల్గొన్నారు. ఆయన బౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సంతాపం వ్యక్తం చేశారు. జెడ్పీ మాజీ చైర్మెన్ వెంట బంజారా నాయకులు భారత్ చౌహాన్, రెడ్డి నాయక్, చంద్రకాంత్ టీచర్, రాథోడ్ బాబులాల్ పాల్గొన్నారు.



సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి



నవతెలంగాణ-నిర్మల్

సంక్షేమ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలను కల్పించాలని, మెస్, కాస్మోటిక్ చార్జీలను పెంచాలని, సొంత భవనాలు నిర్మించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దిగంబర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులకు సరైన బాత్‌రూం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. హాస్టల్ ప్రారంభమై నెల గడుస్తున్నప్పటికీ విద్యార్థులకు దోమతెరలు, బెడ్ షీట్లు, ఇతర వస్తువులు అందకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అన్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు కార్తీక్, రాహుల్, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి

- పట్టణంలో డ్రైడే ఫ్రైడే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దోమలు వృద్ధి చెందకుండా ప్రజలు పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, జిల్లా మలేరియ అధికారి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఫ్రైడే డేలో భాగంగా పట్టణంలోని వార్డు 48 పరిధిలోని నేతాజీ చౌక్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ నీరు నిల్వ లేకుండా చూడాలని అవగాహన కల్పించారు. అక్కడక్కడ కూలర్లు, కుండిల్లో నిల్వ ఉన్న నీటిని పారబోయించారు. తెలంగాణ సంస్కృతిక కళాకారులు పాటల ద్వారా సీజనల్ వ్యాధుల గురించి తెలియజేశారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ, ప్రజలను చైతన్య పరిచారు. వర్షకాలంలో వ్యాధులు దోమలు, కలుషిత నీటితోనే వస్తాయని తెలిపారు. ప్రజలు పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. దోమలు వృద్ధి చెందకుండా నీరు పరిసరాల్లో నిల్వకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సానిటరి ఇన్స్‌పెక్టర్ నరేందర్, పృథ్వీ బౌలి అర్బన్ పీహెచ్‌సీ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్నానాని కెళ్లి ప్రమాదవశాత్తు వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గుడిహత్నూర్ మండలంలోని సోపాన్ ముత్నూర్ గ్రామ చెరువులో శుక్రవారం భాలేరావ్(48) చెరువులో స్నానం కోసం వెళ్లి ఈత రాక పోవడంతో ప్రమాదవశాత్తు మరణించినట్టు ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రవెల్లి మండలం శంకర్‌గూడకు చెందిన మృతుడు గుడిహత్నూర్ మండలంలోని సోపాన్ ముత్నూర్‌లోని బావ ఇంటికి వెళ్లాడు. శుక్రవారం స్నానానికి వెళ్లగా ప్రమాదవశాత్తు మరణించినట్టు తెలిపారు. భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కేజీబీవీల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-నిర్మల్

కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రిన్సిపాల్స్, ప్రత్యేకాధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ప్రత్యేకాధికారులంతా నిరంతరం కేజీబీవీలను తనిఖీలు చేయాలనీ, సమస్యలను గుర్తించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తనిఖీలకు సంబంధించిన సమాచార నివేదికలను అందజేయాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని రుచిచూసి, నాణ్యతను తెలుసుకోవాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం, అల్పాహారం అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వంటగదిని ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలని, వంటకు నాణ్యమైన కూరగాయలను, వస్తువులను మాత్రమే వాడాలని సూచించారు. కిచెన్ గార్డెన్లను నిర్వహించాలని, ప్రతీ కేజీబీవీలో రక్షణ గోడ, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ లాంటి సౌకర్యాలు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పాఠశాలల్లో అన్ని రకాల కమిటీలను ఏర్పాటు చేసి ఇందులో విద్యార్థులను భాగస్వామ్యం చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో దోమలు వ్యాప్తి చెందకుండా చుట్టుపక్కల ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వఉండకుండా చర్యలు చేపట్టాలని, ఫాగింగ్, ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని, ప్రతి కేజీబీవీలో అనారోగ్యబారిన పడిన విద్యార్థులకు ప్రత్యేక గదిని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతీ కేజీబీవీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని, ఉన్నత ఫలితాలు సాధించేలా కృషి చేయాలని సూచించారు. అనంతరం మండలాల వారిగా కేజీబీవీలలో విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను, సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు, ఇతర అంశాలపై చర్చించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈఓ రవీందర్‌రెడ్డి, ప్రత్యేక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలో జిల్లాకు సీఎం రేవంత్‌రెడ్డి రాక

- కలెక్టర్ రాజర్షిషా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా నిర్వహించేందుకు ఆయా శాఖలకు విధులను కేటాయించడం జరిగిందని కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, ఐటీడీఏ పీఓ ఖుష్బు గుప్తాతో కలిసి సమావేశ మందిరంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అతిత్వరలో సీఎం రేవంత్‌రెడ్డి పలు కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు చేసేందుకు జిల్లాకు రానున్నట్లు పేర్కొన్నారు. ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో హెలిపాడ్ వద్ద షామియానా, కుర్చీలు, బారికేడ్ ఏర్పాట్లు చేయాలని అన్నారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మహిళా శక్తి క్యాంటీన్, ఎంఆర్ఐ మిషన్, కేజీబీవీ హై స్కూల్, బంగారుగూడ, కమాండ్ కంట్రోల్ సెంటర్, మదర్ పౌల్ట్రీ యూనిట్‌లను ఒకే చోట బటన్ క్లిక్ చేసి ప్రారంభిస్తారని తెలిపారు. టీటీడీసీలో ఏర్పాటు చేసిన సమావేశానికి లంచ్, తదితర ఏర్పాట్లను ప్రత్యేక శ్రద్ధతో అధికారులకు కేటాయించిన విధులు సక్రమంగా నిర్వహించాలని అన్నారు. సానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ఈ మేరకు ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ బందోబస్తు పకడ్బందీగా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ దగ్గర పోలీసు బందోబస్తుతో పాటు అత్యవసరమైన వారిని మాత్రమే లోనికి పంపించేందుకు చర్యలు చేపడతామని స్పష్టం చేశారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్, పోలీస్, జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



నవతెలంగాణ-ఉట్నూర్

పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో 44 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాల ప్రజల అభివృద్ధికి పాటు పడుతుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రూ.1 లక్షలోపు రుణాన్ని మాఫీ చేస్తుందని తెలిపారు. రైతుల పక్షపాతి కాంగ్రెస్ అని అన్నారు. కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం పేదింటి ఆడపడుచులకు వరమన్నారు. త్వరలో లక్ష రూపాయాలతో పాటు తులం బంగారం అందజేస్తామని తెలిపారు. అధికారులు ప్రజలతో కలిసి మెలసి ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. వర్ష కాలంలో సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్య సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలను అందించాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

నిషేధిత గుట్కా పట్టివేత

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంతో పాటు సొనాలలో శుక్రవారం నిషేధిత గుట్కా పట్టుకున్నట్టు ఎస్సై రాము తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం... గుట్కా అమ్ముతున్నారన్న సమాచారంతో పలు దుకాణాల్లో పోలీస్ సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించామని అన్నారు. బోథ్‌లోని రెండు దుకాణాల్లో దాడి చేసిన రూ.26వేల 318 విలువ గల, సొనాలలో రూ.8వేల 400 విలువ గల గుట్కా పాకెట్లను పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అలాగే అక్రమంగా నిషేధిత గుట్కాను అమ్మిన వ్యాపారస్తులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

మహిళా కార్మికులకు సదుపాయాలు కల్పించాలి

నవతెలంగాణ-మందమర్రి

సింరేణిలో పని చేసే మహిళా కార్మికులకు సదుపాయాలు కల్పించాలని హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో మహిళా కార్మికులకు సరైన సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం 3వేల మంది పర్మినెంట్, 7వేలు కాంట్రాక్టు కార్మికులు సరైన వసతులు లేక పని చేస్తున్నారన్నారు. మహిళలు ఆత్మగౌరవంతో మెలిగేలా చూడాల్సిన బాధ్యత సింగరేణి యాజమాన్యంపై ఉందని, వారికి రెస్ట్ రూమ్స్ లేవు, టాయిలెట్స్, బట్టలు మార్చుకునే గదులు లేవని పేర్కొన్నారు. గెలిచిన సంఘాలు, యాజమాన్యం మహిళల ఇబ్బందులు పట్టించుకోవడం లేదన్నారు. మహిళా కార్మికులకు మహిళలనే సూపర్‌వైజర్‌గా పెట్టాలని డిమాండ్ చేశారు. గనులు, డిపార్ట్మెంట్‌లలో పురుషులు సూపర్‌వైజర్లుగా ఉండడంతో మహిళలు వేధింపులకు గురవుతున్నారని తెలిపారు. యాజమాన్యం వెంటనే స్పందించి మహిళలకు సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంఎస్ అధ్యక్షులు జక్కుల నారాయణ, మందమర్రి ఏరియా వైస్ ప్రెసిడెంట్ జక్కినబోయిన శ్రీనివాస్, కేంద్ర నాయకులు వెల్ది సుదర్శన్, బోనాల శ్రీనివాస్, చొప్పరి రామస్వామి, థామస్, ముఖేష్, జెల్లి రాజేష్ పాల్గొన్నారు.

తెగిపోయిన రోడ్డును వెంటనే పునరుద్ధరించండి

నవతెలంగాణ-జైపూర్

కోటపల్లి మండలం ఏదులబందం వద్ద తెగిపోయిన రోడ్డును వెంటనే పునరుద్ధరించాలని ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి సూచించారు. శుక్రవారం కోటపల్లి మండలంలో పర్యటించిన ఆయన స్థానిక నాయకులతో కలిసి ఏదులబందం వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు తెగిపోయిన తీరును పరిశీలించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఎగువన కురుస్తున్న వర్షాలతో తలెత్తిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎదులబంద వద్ద రోడ్డు తెగిపోవడంతో పరిసర గ్రామాలకు రాకపోకలు నిల్చిపోయిన తీరుపై జిల్లా కలెక్టర్‌తో సంఘటనా స్థలం నుండి మాట్లాడారు. అదేవిధంగా రాజారం గ్రామ వద్ద వంతెన అప్రోచ్ రోడ్డు పరిశీలించిన ఆయన పనులను త్వరితగతిన పూర్తి చేసి వంతెన మీదుగా రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. బబ్బెరచెలుక గ్రామంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల సౌకర్యార్థం హ్యాండ్ బోరు ఏర్పాటు చేయాలని కోరగా వెంటనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిషత్ వైస్ చైర్మెన్ మూల రాజిరెడ్డి, కోటపల్లి, చెన్నూర్ మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

నవతెలంగాణ-కౌటాల

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్సై ఎస్.మధుకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని ధనూర్‌హెట్టి నాగపెల్లి చౌరస్తా వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు అన్ని ధ్రువపత్రాలు కలిగి ఉండాలని, హెల్మెట్ ధరించాలని అన్నారు. ధ్రువీకరణ పత్రాలు లేని వారికి జరిమానా విధిస్తామని, రెండోసారి పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. చిన్న పిల్లలకు వాహనాలు ఇచ్చినట్లయితే తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుట్కా తీసుకెళ్తూ పట్టుబడ్డ వ్యక్తిపై కేసు

నవతెలంగాణ-నేరడిగొండ

స్కూటీపై గుట్కా తీసుకెళ్తూ పట్టుబడ్డ వ్యక్తిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన వినోద్(44) నిర్మల్‌లో ఉంటున్నాడు. శుక్రవారం స్కూటీపై గుట్కా ప్యాకెట్లను నేరడిగొండకు తీసుకొస్తూ మండలంలోని వాంకిడి బస్టాప్ పట్టుబడ్డాడు. రూ.15,410 విలువ చేసే గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ(ఎ) జాబితాలో చేర్చాలి



నవతెలంగాణ-తాంసి

ముదిరాజ్ కులస్తులమైన వెనుకబడిన కులానికి చెందిన ముదిరాజ్ లను బీసీ(డి) నుంచి బీసీ(ఎ) జాబితాలో చేర్చాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ముదిరాజ్ జిల్లా అధ్యక్షులు శివయ్య ఆధ్వర్యంలో ముదిరాజ్ కులస్తులతో కలిసి డిప్యూటీ తహసీల్దార్ విష్ణు జాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023లో జరిగిన తెలంగాణ శాసనసభ ఎన్నికల మేనిఫెస్టోలో అభయ హస్తంలో మీరు ఇచ్చిన హామీలు మా వర్గాలలో కొంత విశ్వాసాన్ని నింపాయని అన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు మాసాలు పూర్తయిన సందర్భంగా మా సమస్య పరిష్కారం కొరకు దృష్టి సారించాల్సిందిగా కోరుతున్నామని అన్నారు. హామీ ప్రకారం జీఓ నెంబర్ 15వ తేదీ 2009 ముదిరాజ్ ముత్రాశి తెనుగోళ్ల బీసీ(డి) నుంచి బీసీ(ఎ)లోకి మార్చాలన్నారు. 2014 సర్వే ప్రకారం తెలంగాణ జనాభాలో ఎక్కువ సంఖ్య కలిగిన జనాభాగా వెనుకబడిన తరగతుల్లో దాదాపు మొత్తం జనాభాలో 14 శాతంగా ఉన్నామన్నారు. మా కులానికి చెందిన వారు మత్స్య వృత్తి తోటలు పెంపకం వంటి వృత్తి పైన ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నామన్నారు. రాజకీయరంగంలో ముదిరాజ్‌ల ప్రాతినిధ్యం పెంచడానికి మంత్రివర్గంలో చోటు కల్పించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి ముదిరాజ్ కులస్తులకు గౌడ కులస్తులకు ఇస్తున్న మాదిరిగా మాకు కూడా ఆసరా పెన్షన్ ఇవ్వాలన్నారు తెలంగాణ శాసనసభలో మూడు స్థానాలు రాజ్యసభలో ఒక స్థానం కల్పించి 10శాతం కార్పొరేషన్‌లలో చైర్మెన్లుగా నియమించాలని కోరారు. వినతిపత్రాన్ని సంబంధిత అధికారులకు చేరే విధంగా చూడాలని కోరారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గుగ్గిల పొచ్చన్న, స్వామి, శ్రీకాంత్, రమకాంత్, మహేందర్ శ్రీనివాస్, రాఘవేంద్ర, ముదిరాజ్ కుల సంఘ సభ్యులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

బోథ్ : ముదిరాజ్‌లను బీసీ(ఎ)లో చేర్చాలని కోరుతూ శుక్రవారం మండలంలోని సొనాల గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో ఉప తహసీల్దార్ మల్లేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం మండలాధ్యక్షుడు గుంజాల బోజన్న మాట్లాడుతూ గతంలో దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి ఇచ్చిన జీఓ నెంబర్ 17ను యధావిధిగా అమలు చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ముదిరాజ్ సామాజిక వర్గాన్ని అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్సీ పదవులతో పాటు ఒక రాజ్యసభ పదవి 10 కార్పొరేషన్ పదవులు కట్టబెట్టాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ముదిరాజ్ సంఘం అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాయుడు శ్రీనివాస్, కోశాధికారి మహిపాల్, మండల మాజీ అధ్యక్షులు సున్నపు శ్రీనివాస్, యూత్ అధ్యక్షులు మెండు శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారంగాపూర్ : ముదిరాజుల కులస్థులను బీసీ(డి) నుంచి బీసీ ఏ గ్రూపులోకి చేర్చాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బోండ్ల రమేష్ మాట్లాడారు. ముదిరాజుల అభివృద్ధికోసం ప్రతి సంవత్సరం రూ. 1000 కోట్ల నిధులు విడుదల చేయాలన్నారు. మత్స్యసంపదపై గంగ పుత్రులతో పాటు ముదిరాజులకు చట్ట పరమైన ఆదేశాలు జారీ చేయాలి. తెలంగాణ మత్స్య అభివృద్ధి బోర్డు ఏర్పాటు చేసి చైర్మెన్‌ను ముదిరాజును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు దొడ నర్సయ్య, తీగల మోహన్, గంగాధర్, నర్సయ్య, గంగాధర్, సాయెందర్ పాల్గొన్నారు.



